క్లుప్తంగా

జోరుగా చప్టా మరమ్మతులు



జి.కొండూరు: తుపాను దాటికి బుడమేరులో వరద ఉధృతి పెరిగి జి.కొండూరు మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య బుడమేరు వాగుపై ఉన్న లోలెవెల్ చప్టాకు అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. వాగులో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలా శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నాయకులు మాట్లాడుతూ వాగుపై హై లెవెల్ వంతెన నిర్మాణం కోసం రూ.8.5 కోట్లకు ఇప్పటికే ప్రతిపాదనలను పంపిన నేపథ్యంలో నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణం చేపడతామని వివరించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 10 మంది ఎంపిక



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ క్యాంపస్ సెలక్షన్స్ మంగళవారం నిర్వహించారు. కళాశాలలో వివిధ విభాగాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు 195 మంది హాజరయ్యారు. రాతపరీక్ష, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నిర్వహించిన అనంతరం ప్రతిభ చూపిన 10మందిని ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, ప్లేస్‌మెంట్ అధికారి నరేంద్ర సంతోష్‌కుమార్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. జాబ్‌కు ఎంపికైన విద్యార్థులకు చైర్మన్ ఎం ఎం కొండయ్య అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్ పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



దాములూరు(ఇబ్రహీంపట్నం): తుపాను తాకిడితో దెబ్బతిన్న పంట పొలాలను ఏఓ శైలజ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్ర ఉప సంచాలకులు మాధవీలత, సహాయ సంచాలకులు మోనీషా దాములూరు, కొటికలపూడి గ్రామాల్లో వరి, మొక్కజొన్న, శెనగ పంటలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో ఫంగస్ రాకుండా వరి పనలపై ఉప్పు ద్రావణం, ప్రాపికొనజోల్ ఒక మిల్లీ లీటర్ ద్రావణం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. శెనగ వడలి పోకుండా 3 గ్రాముల ఆక్సీక్లోరైడ్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొక్కజొన్నకు 20 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. లద్దెపురుగు నివారణ సూచనలు చేశారు.సర్పంచ్ మధుసూదనరావు,ఏఈఓ నరేంద్రనాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో ఒప్పందం



మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. లియో గ్లోబల్ ఓవర్సీస్ అసిస్టెంట్ మేనేజర్ అబ్బాయ్ చౌదరి ఒప్పందం(ఎంఓయూ) కార్యక్రమంలో పాల్గొన్నారని, దీని ప్రకారం విదేశాల్లో వీసా, అడ్మిషన్, స్కాలర్‌షిప్, వసతి సౌకర్యంపై లకి రెడ్డి హనిమిరెడ్డి కళాశాల తమ సంస్థ తరఫున సహాయ, సహకారాలు అందిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీనిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, డాక్టర్ ఎం. దేవానంద్‌కుమార్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జే రాముడు, సీనియర్ ఫాకల్టీ నారాయణరావు, హరిబాబు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశం, మానవ పురోగతి సాధ్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): శాస్త్ర విజ్ఞానంతో దేశం, మానవ పురోగతి సాధ్యమని, సాంకేతిక రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను విద్యార్థులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని శాస్త్రవేత్త ఎస్‌జీ శ్రీనివాస్ పేర్కొన్నారు. గొల్లపూడి ఎస్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో మంగళవారం 'సైన్స్‌తోనే మానవ పురోగతి' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. నేటి తరం సైన్స్ విద్యార్థులు సైంటిస్ట్‌లుగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ విద్యా సంస్థల డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, ప్రిన్సిపాల్ ఎస్ వాణి కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ వార్డులో ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని తెలపడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపించి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిని బట్టే ప్రజల సమస్యల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ప్రజలు గమనించాలన్నారు. రైతుభరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, రుణమాఫీ, విద్యాదీవెన, వసతి దీవెన, వాహనమిత్ర, కాపునేస్తం తదితర అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. పట్టణ పరిధిలో దాదాపు 3,600 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి వారికి పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తున్నందున లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవాలన్నారు. వందలాది మంది పేదలకు అస్సైన్‌మెంట్ పట్టాలను ప్రభుత్వం అందజేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఒక్క సెంటు కూడా ఇళ్ల స్థలం పేదలకు ఇవ్వలేదన్నారు. ఎన్నికలు దగ్గరకొస్తుండడంతో చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వచ్చారన్నారు. ఓట్ల కోసం అమలుకాని హామీలు ఇచ్చేందుకు కూడా వెనుకాడరని, వాటిని నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, 10, 9 వార్డు కౌన్సిలర్లు మీర్ అంజద్ ఆలీ, బాణావతు రంగారావు, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము పాల్గొన్నారు.

పేదల బాగుకు ప్రభుత్వం కృషి



గంపలగూడెంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు



తిరువూరు మండలం వావిలాలలో పల్లెకు పోదాం కార్యక్రమం



హెచ్ ముత్యాలంపాడు సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు



ఆగిరిపల్లి మండలంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

గంపలగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో పేదల బాగు కోసం కృషి చేస్తున్నారని, ఇందులో భాగమే నరరత్నాల సంక్షేమ పథకాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం-2 సచివాలయం పరిధిలో మంగళవారం రాత్రి పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డు సర్పంచ్ కోట పుల్లమ్మ ఆవిష్కరించారు. గాంధీ బొమ్మ సెంటర్లో వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చెరుకు నరసారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, వంశీ, కోట సునీత, కోటేశ్వరరావు, జగన్‌మోహన్‌రెడ్డి, అచ్చియ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో 'పల్లెకు పోదాం'

జి.కొండూరు: మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు గ్రామంలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసిన నాయకులు, గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును గ్రామ సచివాలయంలో ప్రారంభించారు.

వావిలాలలో..

తిరువూరురూరల్: మండలంలోని వావిలాలలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డులను, బ్రోచర్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ భారతి, ఎంపీటీసీ లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు నారాయణరావు, కిషోర్, గోపి రెడ్డి, నాయకులు గోపాలం, కృష్ణయ్య, ఏసురత్నం పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసమే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు అన్నారు. ఈదర-2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగానీ నరసింహారావు, నాయకులు పెద్ద సత్యంబాబు, ఇస్సాకు, సీతారాంపురం సర్పంచ్ మురళి, నందూరు భాస్కర్ ప్రసాదు పాల్గొన్నారు.

పల్లె సీమల రూపురేఖలు మార్చిన జగనన్న

ముసునూరు: పక్కా ప్రణాళిక, ముందుచూపుతో రాష్ట్రంలోని పల్లె సీమల రూపు రేఖలను జగనన్న సంపూర్ణంగా మార్చారని ఎంపీపీ దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా వేల్పుచర్ల సచివాలయం వద్ద సర్పంచ్ మోహనరావు అధ్యక్షతన మంగళవారం 'పల్లెకుపోదాం' నిర్వహించారు.

ప్రజాస్వామ్యానికి వెన్నెముక ఓటుహక్కే

తిరువూరు ఆర్డీఓ మాధవి



తిరువూరులో ఓటుహక్కు ఆవశ్యకతపై ప్రదర్శనలో పాల్గొన్న ఆర్డీఓ తదితరులు



విస్సన్నపేటలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తిరువూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో వయోజనులందరూ ఓటుహక్కు పొందాలని తిరువూరు ఆర్డీఓ కే మాధవి అన్నారు. తిరువూరులో ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన ప్రదర్శనను తహసీల్దారు కార్యాలయం వద్ద ఆర్డీఓ మంగళవారం ప్రారంభించారు. తమ ప్రజా ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కే వజ్రాయుధమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. ఫ్యాక్టరీ సెంటర్ వరకు జరిగిన ప్రదర్శనలో తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు, తహసీల్దారు సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

విస్సన్నపేట: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ డిగ్రీ విద్యార్థులతో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, డీటీ మోతీయా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తేమశాతం ఎక్కువ ఉన్నా ధాన్యం కొనుగోలు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం కూనపరాజు పర్వ గ్రామంలో డీసీఎంఆర్ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తేమశాతం ఎక్కువ ఉన్నా కూడా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రంగుమారిన ధాన్యం కూడా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోటకూర రవిబాబు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, సుబ్బారావు, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి



ఇబ్రహీంపట్నంలో ఆడుదాం ఆంధ్రా కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జోత్స్న, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు



తిరువూరులో ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ



గంపలగూడెంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



విస్సన్నపేటలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీఓ వెంకటరమణ



గోపవరంలో క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

తిరువూరు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యువత సహకరించాలని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కిట్లను వార్డు సచివాలయ సిబ్బందికి చైర్‌పర్సన్ మంగళవారం పంపిణీ చేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కస్తూరిబాయి తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

ఇబ్రహీంపట్నం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. 18ఏళ్లు నిండిన ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి 20 వరకు గ్రామస్థాయి, 21 నుంచి వచ్చే నెల నాలుగు వరకు మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు మహిళలు, పురుషులకు జరుగుతాయి. ఆసక్తిగల వారు ఆయా గ్రామాల సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఈఓపీ ఆర్డీ మనోజ్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

తిరువూరురూరల్: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణకు అవసరమైన కిట్లను మంగళవార తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ప్రతి గ్రామం నుంచి క్రీడాకారులను ఈ పోటీలకు సిద్ధం చేయడానికి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తగు కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు సంబంధించిన కిట్లను సచివాలయ సిబ్బందికి అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ నరసింహారావు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: త్వరలో జరగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ మంగళవారం సమావేశం నిర్వహించారు. క్రీడాకారుల నమోదు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ముసునూరులో..

ముసునూరు: యువతలోని క్రీడా సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని ముసునూరు, గోపవరం, కొర్లగుంట, కాట్రేనిపాడు, బలివే, వేల్పుచర్లల్లో మంగళవారం ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రకు ఎంపికైన గ్రామ సచివాలయ స్థాయి క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కె. గోపాలకృష్ణ, సర్పంచ్‌లు సత్యనారాయణ, ప్రవీణ సుధాకర్, మోహనరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌గా జాకీర్‌హుస్సేన్ కళాశాల



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జాఫర్ సాధిక్

ఇబ్రహీంపట్నం: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో జాకీర్ హుస్సేన్ కళాశాల పురుషులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాఫర్ సాధిక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఉయ్యూరు ఏసీ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తొమ్మిది బంగారు, నాలుగు రజిత, రెండు కాంస్య పతకాలతో చాంపియన్‌గా నిలిచారు. మహిళా విభాగంలో షార్ట్‌పుట్‌లో బంగారు పతకం, రిలే పరుగులో కాంస్య పతకం సాధించారు. జనవరిలో చెన్నైలో జరిగే ఆల్ ఇండియా సౌత్, వెస్ట్‌జోన్ చాంపియన్ షిప్ పోటీలకు రాజేష్, గోపీచంద్, శివగంగ, విజయరామరాజు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలియజేశారు.

టేబుల్ టెన్నిస్‌లో ఎల్‌బీఆర్‌సీపీ విద్యార్థుల ప్రతిభ

మైలవరం: జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్‌సీఈ) విద్యార్థినులు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి మంగళవారం జరిగిన సమావేశంలో తెలిపారు. ఈ నెల 9,10 తేదీలలో జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ మెన్ అండ్ ఉమెన్ టోర్నమెంట్ కం యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ ట్రైలర్ తాడేపల్లిగూడెం, శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. మైలవరం ఎల్‌బీఆర్‌సీఈ టీటీ ఉమెన్ విభాగంలో ఈసీఈ విద్యార్థినులు శ్రీప్రజ్ఞ, జ్యోతిక, సింధు తృతీయ స్థానంలో గెలుపొందినట్లు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులను వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్‌ను, అసిస్టెంట్ పీడీలు ఎస్.దుర్గారెడ్డి, ఎం.బేబీ రాణిలను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నిరవధిక సమ్మె చేపట్టిన గ్రామీణ తపాలా ఉద్యోగులు



నూజివీడులో నిరసన దీక్షలో పాల్గొన్న జీడీఎస్ సిబ్బంది

నూజివీడు: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నాయకత్వం పిలుపు మేరకు నూజివీడు సబ్ డివిజన్‌లోని పోస్టల్ సిబ్బంది మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు కమలేష్‌చంద్ర సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అదనపు సర్వీసు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వీవీఎస్ అజరయ్య, కోశాధికారి జీవీ సారధి, ఉపాధ్యక్షుడు మంగయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం వాకిలయ్య, కోటేశ్వరరావు, రవి, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు తిరువూరు డివిజన్లోని సిబ్బంది మంగళవారం సమ్మె చేపట్టారు. సర్వీసుకు అనుగుణంగా ఇంక్రిమెంట్ల పెంపు, గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం, 8 గంటల పనివేళలు అమలు చేయాలని కోరుతూ కేంద్రప్రభుత్వానికి పలుమార్లు తమ యూనియన్ విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదన్నారు. దీంతో నిరవధిక సమ్మె చేపట్టామని నాయకులు లక్ష్మణరావు తెలిపారు. తిరువూరు సబ్ పోస్టాఫీసు ఎదుట ధర్నా చేశారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను అందరూ ఆదరించి, అక్కున చేర్చుకోవాలని ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో సుంకర కృషి మరువలేం

తిరువూరు: కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్వహించడంలో దివంగత సుంకర వీరభద్రరావు చేసిన కృషి మరువలేనిదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. సుంకర వీరభద్రరావు వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం గ్రామగ్రామాన వ్యాప్తి చేసి భూపంపిణీకి పోరాడిన ఘనత వీరభద్రరావుకు దక్కుతుందన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, నాయకులు నాగుల్ మీరా, సుబానీ తదితరులు వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

మైలవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను రూరల్ జోన్ డీసీపీ అజిత వేజేండ్ల మంగళవారం తనిఖీ చేశారు. ఆ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. కేసుల నమోదు వివరాలు, కేసులు పరిష్కరించిన వివరాలు, మైలవరంలో జరుగుతున్న క్రైమ్ వివరాలపై ఎస్సై హరిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

ముసునూరు: సర్పంచ్ చొరవ చూపి శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించడంతో గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల దళిత వాడ శ్మశానవాటిక పూర్తిగా సర్కారు తుమ్మ, జిల్లేడు చెట్లతో నిండిపోయి, మృత దేహాలను ఖననం చేయడానికి వీలు లేనంతగా, అడుగు తీసి మరో అడుగు వేయలేనంతగా మారింది. విషయాన్ని సర్పంచ్ పుట్ల మోహనరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తక్షణమే స్పందించిన ఆయన మంగళవారం శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక యువకులు అబ్బూరి కిషోర్, హరీష్ పాల్గొన్నారు.